

పొచ్చెరకు అడెల్లు మృతదేహం

మావోయిస్టు అడెల్లు మృతదేహం ఆదివారం రాత్రి పొచ్చెర గ్రామానికి చేరుకుంది. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

8లో▸



'గిరి' గ్రామాల్లో విత్తనపూజ

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవడంలో ఆదివాసీలు ముందుంటారు. మృగశిర కార్తె ప్రవేశించడంతో 'గిరి' గ్రామాల్లో విత్తన పూజకు శ్రీకారం చుట్టారు.

8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
38.0/29.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

వివేక్ అనే నేను...



మంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం వివేక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే
- చెన్నూర్ నుంచి అన్నయ్య తరువాత తమ్ముడికి అవకాశం
- ప్రేమ్‌సాగర్ రావు, వినోద్‌కు ఆశాభంగం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంత్రిగా చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదివారం రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నూర్ నుంచి వరుసగా ఆయన సోదరుడు వినోద్ తరువాత మంత్రిగా బాధ్యతలు చేపట్టి రికార్డు సృష్టించారు. ఇప్పటికే గడ్డం ఫ్యామిలీ నుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యేగా వినోద్ ఉండగా ఎంపీగా వంశీకృష్ణ కొనసాగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే వివేక్‌కు మంత్రి మండలిలో చోటు దక్కుతుందని ఊహాగా నాలు వెలువడ్డాయి. అయినప్పటికీ జిల్లా నుంచే మరో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, వినోద్ సైతం పోటీలో ఉండగా చివరకు అధిష్టానం వివేక్‌కే మంత్రి పదవి కట్టబెట్టింది. వివేక్ వర్గీయులు శనివారం నుంచే సంబురాలు చేసుకుంటున్నారు.

హామీలు నెరవేర్చడమే లక్ష్యం..

నియోజక వర్గ ప్రజలకు తానిచ్చిన హామీలు నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తానని మీడియాతో మంత్రి వివేక్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యమవుతానని ఈ సందర్భంగా తెలియజేశారు.



చెన్నూర్ క్యాంప్ కార్యాలయం ఎదుట సంబరాలు

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామికి మంత్రి పదవి రావడంతో చెన్నూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. చెన్నూర్‌కు చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకులు మంత్రి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు. భీమారంలోని జాతీయ రహదారిపై టపాసులు కాల్చారు. దండేపల్లిలో మాల సామాజిక వర్గం నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

తీవ్ర నిరాశలో ప్రేమ్‌సాగర్‌రావు...

కొంతకాలంగా కేబినెట్‌లో తనకు తప్పనిసరిగా స్థానం ఉంటుందని ఆశించిన మంచిర్యాల ఎమ్మెల్యేకు తీవ్ర ఆశాభంగం కలిగింది. దీంతో ఆయన వర్గీయులు శనివారం నుంచే తీవ్ర నిరాశకు లోనయ్యారు. ప్రేమ్‌సాగర్‌రావును బుజ్జగించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రంగంలోకి దిగి ఆయనకు పలు విధాలుగా నచ్చజెప్పినట్లు తెలుస్తోంది.

మంత్రిని కలిసిన నాయకులు

మంత్రి వివేక్ వెంకటస్వామిని మంచిర్యాలకు చెందిన తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, మందమర్రి కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు నీలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, కోటపల్లి మాజీ సర్పంచ్‌లు కుమ్మరిసంతోశ్, గట్టు లక్ష్మణ్ గౌడ్, తదితరులు కలిశారు.

పీఎస్సార్‌ను కలిసిన మీనాక్షి నటరాజన్



పీఎస్సార్‌ను కలిసి వెళ్తున్న మీనాక్షి నటరాజన్

మంచిర్యాలటౌన్: మంత్రి పదవి ఆశించి భంగపడిన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివా సంలో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లు కలిశారు. పీఎస్సార్‌కు కాకుండా చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వడంతో వారిద్దరూ ఆయనను కలిసి బుజ్జగింపు యత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. కాగా, మొదటి నుంచి పార్టీని ఉమ్మడి జిల్లాలో కాపాడుకుంటూ వచ్చిన పీఎస్సార్‌కే మంత్రి పదవి వస్తుందనే అంతా భావించారు. తీరా రాకపోవడంతో ఆయన వర్గీయుల్లో నైరాశ్యం నెలకొంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఐసెట్

ఆదిలాబాద్‌టౌన్: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ఐసెట్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్ష కొనసాగింది. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహించిన సెషన్‌లో 100 మందికి గాను 93 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి 5గంటల వరకు నిర్వహించిన సెషన్‌లో 100 మందికి గాను 91 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ పున్నారావు తెలిపారు.

బల్దియా పారిశుధ్య విభాగంలో అక్రమాలు

- విచారణకు ఆదేశించిన వరంగల్ ఆర్‌డీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని పారిశుధ్య విభాగంలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ రీజినల్ డైరెక్టర్ (ఆర్‌డీ) ఉత్తర్వులు జారీ చేయడం బల్దియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ విభాగంలో కీలకమైన అధికారి డబ్బులు తీసుకుంటూ ఉద్యోగులను భర్తీ చేశారని, పారిశుధ్య వాహన వినియోగాల్లోనూ అవకతవకలకు పాల్పడ్డారనే పలు అంశాలను ప్రస్తావిస్తూ పట్టణానికి చెందిన నవీన్ మున్సిపల్ ఆర్‌డీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు స్పందించిన ఆర్‌డీ విచారణకు ఆదేశిస్తూ మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. స్పందించిన కమిషనర్ మున్సిపల్ ఇంజినీర్ పేరి రాజును విచారణాధికారిగా నియమించారు. అయితే సదరు అధికారి ఎలాంటి నివేదిక అందజేస్తారు.. దాని ఆధారంగా ఎలాంటి చర్యలుంటాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మురళి ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు, ఇంటర్ ఫెయిల్ అయిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వయస్సు 22 ఏళ్లు మించకూడదని పేర్కొన్నారు. ఈనెల 26లోగా దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని సూచించారు. కళాశాలలో బాల, బాలికలకు వేర్వేరుగా హాస్టల్ వసతి ఉందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8332930238, 80969969659 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

మృగశిరకార్తె సందడి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో మృగశిర కార్తె సందడి కనిపించింది. కార్తె తొలి రోజున చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ సారి ఆదివారం రావడంతో పట్టణంలోని చేపల మార్కెట్ కొనుగోలుదారులతో సందడిగా మారింది. ఇదే రోజున రైతులు పంట చేలల్లో విత్తనాలు విత్తుకోవడం ఆనవాయితీ. అలాగే మామిడి పండ్ల పానకం కూడా చేసుకుంటారు. ఇందులో భాగంగా చుట్టుపక్కల గ్రామాల రైతులు పండ్ల మార్కెట్‌కు తరలి రావడంతో కళకళలాడింది. అన్నదాతలు సైతం సాగు పనులు షురూ చేశారు.

వామ్మో.. జూన్!



- తల్లిదండ్రులపై 'ప్రైవేట్' భారం
- ఇష్టానుసారంగా బడి ఫీజులు
- ఈనెలలోనే యూనిఫాం, పుస్తకాలు
- తోడైన సాగు పెట్టుబడులు
- సామాన్యులు విలవిల

జిల్లాలో..
ప్రైవేట్ పాఠశాలలు 162
విద్యార్థులు 48,931

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాలు ఇలా..

తరగతి	ఫీజు (రూ.లలో)
ఎల్‌కేజీ	20వేలు– 30వేలు
యూకేజీ	25వేలు– 30వేలు
ఒకటో తగరతి	30వేలు– 35వేలు
రెండో తరగతి	30వేలు– 35వేలు
మూడో తరగతి	35వేలు– 38వేలు
నాలుగో తరగతి	38వేలు– 40వేలు
ఐదో తరగతి	40వేలు– 42వేలు
ఆరో తగరతి	40వేలు– 45వేలు
ఏడో తరగతి	40వేలు– 45వేలు
ఎనిమిదో తరగతి	45వేలు– 50వేలు
తొమ్మిదో తరగతి	50వేలు– 60వేలు
పదో తరగతి	60వేలు– 70 వేలు

ఆదిలాబాద్‌టౌన్: జూన్ వచ్చిందంటే తల్లిదండ్రుల్లో దడ పుడుతుంది. పాఠశాలలు ఇక పునఃప్రారంభం కానుండడంతో పుస్తకాలు, యూనిఫాం, ఫీజులు పేరిట వారిపై అదనపు భారం పడనుంది. మరో వైపు వర్షాకాలం సీజన్ షురూ కావడంతో రైతులు సాగుపై దృష్టి సారిస్తున్నారు. దుక్కిదున్నడం, విత్తనాలు, ఎరువులు కొనుగోలు పనుల్లో నిమగ్నమవుతున్నారు. అయితే ఓ వైపు పిల్లల చదువులు, మరో వైపు సాగు పెట్టుబడి కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్‌లో ఎల్‌కేజీ, యూకేజీలకే వేలాదిగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇంటర్, డిగ్రీ చదువులకు సైతం భారీగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అయినా సరే తమ పిల్లలను ప్రైవేట్‌లో ఉన్నతంగా చదివించి మంచి భవిష్యత్తు అందించాలని సామాన్యులు కలలు కంటున్నారు. ఇదే అదునుగా కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అందినకాడికి దండుకుంటున్నాయి. డొనేషన్లు,ఫీజుల పేరిట ఇష్టారీతిన వసూలు చేస్తున్నాయి. జీవో నం.1కు తూట్లు పొడుస్తూ విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నాయి. నామమాత్రమైన పేరెంట్ కమిటీలు ఆ పాఠశాలలకు కొమ్ముకాయడంతో 'ఫీ'జులుం సాగుతుంది. విద్యా శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వారి ఆగడాలు మితిమీరుతున్నాయి.

అందినకాడికి దండుకోవడమే..

జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు వ్యాపార సంస్థలుగా మారాయి. అడ్డగోలు ఫీజుల వసూలుతో పాటు యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్‌లు, టై, బెల్టు, షూ ఇలా ప్రతీది విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. బడి ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. మరికొన్ని పాఠశాలలు జిల్లాకేంద్రంలో వారు సూచించిన బుక్‌స్టాల్, బట్టల షాపుల్లోనే కొనుగోలు చేయాలని చీటీలు అందిస్తున్నారు. అక్కడ తప్పితే మరోచోట కొనుగోలు చేయవద్దని హుకుం జారీ చేస్తున్నారు. ఆ పుస్తకాలు మిగతా స్టోర్‌లలో దొరక్కపోవడంతో దిక్కుతోచని స్థితిలో అక్కడే అధిక ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. 1వ తరగతి చదివే విద్యార్థుల నోట్, పాఠ్య పుస్తకాలకే రూ.3వేల నుంచి రూ.5వేల వరకు వెచ్చించాల్సిన దుస్థితి. ఇంత జరుగుతున్నా అధికారులు 'మామూలు'గా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని డీఈవోకు వినతి అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు (ఫైల్)

వ్యాపార సంస్థలుగా మారిన ప్రైవేట్ బడులు..

జిల్లాలో ప్రైవేట్ పాఠశాల్లో ఎల్‌కేజీ, యూకేజీ చదువులకే ఏడాదికి రూ.30వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ–టెక్నో, బీజీ, మోడల్, కాన్సెప్ట్, టెక్నో, గ్రామర్, ఐఐటీ, నీట్, జెఈఈ ఇలా తోక పేర్లు తగిలిస్తూ తల్లిదండ్రుల కలలను సొమ్ము చేసుకుంటున్నారు. హాస్టళ్లు కూడా ఏర్పాటు చేసి ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు తీసుకోకూడదు. అయినా కొన్ని పాఠశాలలు ఇష్టారీతిన వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పాఠశాలల్లో కనీస వసతులు కూడా ఏర్పాటు చేయడం లేదు. ఇరుకు గదులు, క్రీడా మైదానం లేకపోవడం, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, తాగు నీరు, తదితర సౌకర్యాలు లేనప్పటికీ ఫీజుల వసూలులో మాత్రం వెనుకాడడం లేదు.

ప్రైవేట్ దోపిడీ అరికట్టాలి



అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులను దోపిడీకి గురిచేస్తున్నాయి. ప్రభుత్వం ఫీజులను అరికట్టాలి. విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు విక్రయిస్తున్నారు. అయినా అధికారులు ఎలాంటి తనిఖీలు చేపట్టడం లేదు.

– గణేశ్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యాశాఖ అనుమతించిన బుక్‌స్టాల్‌లోనే పాఠ్య పుస్తకాలు విక్రయించాలి. ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు చేపడతాం.

– ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో

స్టేడియం సరే.. వసతులేవి?

- ఐపీ స్టేడియంలో అరకొర సౌకర్యాలు
- సామర్థ్యం మేర రాణించలేకపోతున్న అథ్లెట్లు
- దృష్టి సారించాలంటున్న క్రీడాకారులు
- సింథటిక్ ట్రాక్ ఏర్పడితే ప్రయోజనం



చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారిన ట్రాక్ (ఫైల్)

ఆదిలాబాద్: క్రీడాకారులు రాణించాలంటే అనువైన ఆటస్థలంతో పాటు శిక్షకులు ఎంతో అవసరం. అలాగే ఆయా క్రీడలకు అవసరమై క్రీడా సామగ్రి సైతం అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. ముఖ్యంగా అథ్లెటిక్స్ వంటి వ్యక్తిగత క్రీడాంశాల్లో వీటి అవసరం మరింత అధికం. అథ్లెటిక్స్‌లో 23 పైగా ఈవెంట్స్ ఉంటాయి. వాటి కోసం ప్రత్యేకంగా క్రీడా పరికరాలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ఎంతోమంది ఔత్సాహిక క్రీడాకారులు ఉన్నప్పటికీ వసతులలేమి, శిక్షకుల కొరతతో రాష్ట్ర స్థాయి పోటీలకు మాత్రమే పరిమితమవుతున్న దుస్థితి. క్రీడల్లో రాణించాలని పట్టుదల ఉన్నప్పటికీ జిల్లా కేంద్రంలో సరైన సదుపాయాలు ప్రోత్సాహం కరువై నిరుపేద అథ్లెట్లు అర్ధంతరంగా క్రీడలను వదిలేస్తున్నారు.

అధ్వానంగా రన్నింగ్ ట్రాక్..

అథ్లెటిక్స్‌లో రాణించాలంటే ఒక్కో అథ్లెట్ సగటున 10 నుంచి 12 ఏళ్ల వరకు శ్రమిస్తే జాతీయ స్థాయికి ఎదగవచ్చనేది క్రీడా నిపుణుల అభిప్రాయం. అయితే క్రీడాకారులు సన్నద్ధం అవ్వాలంటే రన్నింగ్ ట్రాక్‌తో పాటు ఫిజియోథెరపిస్ట్, జిమ్, ఆయా క్రీడాంశాలకు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉండాలి. అలాగే ప్రత్యేక కోచ్ పర్యవేక్షణ తప్పనిసరి. అప్పుడే క్రీడాకారులు అత్యున్నతంగా రాణించగలుగుతారు. అయితే జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని(ఐపీ) స్టేడియంలో మొరం ట్రాక్ పైనే సాధన చేయాల్సిన దుస్థితి. దీంతో ఎంతో మంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నా జాతీయ స్థాయి పోటీల వరకు వెళ్లలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కరువైన సదుపాయాలు..

అథ్లెటిక్స్‌లో రన్నింగ్‌తో పాటు జంప్స్, త్రోస్, కంబైన్డ్ ఈవెంట్స్ వంటి నాలుగు విభాగాలుంటాయి. ఆయా క్రీడల్లో రాణించాలంటే అవసరమైన హార్డిల్స్, హైజంప్, లాంగ్‌జంప్ పిట్ పోల్ వాల్ట్ బెడ్ల ఏర్పాటు ఎంతో ముఖ్యం. అయితే ఐపీ స్టేడియంలో అరకొర వసతుల నడుమ సాధన చేయాల్సి వస్తుంది. ఇక ఇదే స్టేడియంలోనే ఉన్న క్రీడా పాఠశాల విద్యార్థులకు అథ్లెటిక్స్ విభాగంలో ప్రత్యేకంగా కోచ్ ఉన్నారు. అయితే జిల్లాకు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు మాత్రం శిక్షకుడు లేకపోవడం గమనార్హం. దీంతో వారే సొంతంగా మైదానంలో సాధన చేసుకోవడం గానీ, ఇతర ప్రైవేట్ శిక్షణ సంస్థల్లో చేరాల్సిన పరిస్థితి. జిల్లాలోనే విశాలమైన మైదానం ఉన్న స్టేడియంలో అథ్లెటిక్స్ ఆడేందుకు మరిన్ని అవకాశాలు కల్పిస్తే ఎంతోమంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని క్రీడాభిమానులు, క్రీడాకారులు అభిప్రాయపడుతున్నారు.

సింథటిక్ ట్రాక్ ఏర్పాటు అయితే..

స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటయితే సాధన ఎంతో మెరుగ్గా సాగుతుంది. సాంకేతికతతో కూడిన శిక్షణ అందుతుంది. అలాగే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించే అవకాశాలు పుష్కలంగా పెరుగుతాయి. ప్రస్తుతం సాధారణ ట్రాక్‌పై సాధన చేస్తున్న క్రీడాకారులు పూర్తిస్థాయిలో తమ సామర్థ్యం మేరకు రాణించలేకపోతున్నారు.

సాయ్ కేంద్రమూ రావొచ్చు..

క్రీడాకారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పడితే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించవచ్చు. సింథటిక్ ట్రాక్‌తోపాటు అథ్లెటిక్స్ క్రీడలకు సంబంధించి మరిన్ని వసతులు అందుబాటులోకి వస్తే అకాడమీ ఏర్పాటుకు బలం చేకూరుతుంది. ఒకవేళ సాయ్ సెంటర్ మంజూరు అయితే 40 మంది ఆటగాళ్లకు వసతితో కూడిన శిక్షణ అందించవచ్చు.


ఎంతో ఉపయోగకరం..



సింథటిక్ ట్రాక్ ఏర్పడితే అథ్లెట్స్ జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణిస్తారు. శిక్షణ, సాధన చాలా సులువు అవుతుంది. ఎంతో మంది ప్రతిభగల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. ఆదిలాబాద్ వంటి వెనుకబడిన ప్రాంతంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు అయితే ఎంతో ఉపయోగకరం.

– రాకేశ్, అథ్లెటిక్స్ శిక్షకుడు

అసోసియేషన్ తరఫున కృషి..



సింథటిక్ ట్రాక్ ఏర్పాటు విషయమై అసోసియేషన్ తరఫు నుంచి తీవ్రంగా కృషి చేస్తున్నాం. జిల్లాలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు అయితే ఎన్నో జాతీయస్థాయి పోటీలను నిర్వహించవచ్చు. ఇప్పటికే ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే వీలైనంత త్వరగా ట్రాక్ నిర్మాణం అయ్యే అవకాశం ఉంది.

– రాజేశ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్యాబోధన



మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

నేరడిగొండ: సర్కారు బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని తేజాపూర్ గ్రామంలో గల జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్‌లను ఆదివారం సందర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 16 మంది విద్యార్థులను తల్లిదండ్రులు తేజాపూర్ ఎంపీపీఎస్‌లో చేర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందుతుందన్నారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం నిర్ణయం తీసుకున్న తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో భూమారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ పనుల పరిశీలన

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో 2018 నుంచి 2025 వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 'జల్ సంచాయ్ జల్ భగీదారి' పథకంలో భాగంగా చేపట్టిన నీటి సంరక్షణ పనులను కేంద్ర జల కమిషన్ శాఖ ప్రతినిధి జతిన్ ఆదివారం పరిశలించారు. ఇంకుడు గుంతలు, పూడికతీత, చెక్‌డ్యాంలు, ఫారం పండ్ వంటి మొత్తం 7,285 నీటి సంరక్షణ పనులు చేపట్టగా ఎంపిక చేసిన 92 పనులను సందర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష 5 వేల పనులు పూర్తి చేసి కేంద్ర జల కమిషన్‌కు ఫొటోలు అప్‌లోడ్ చేయడంలో ఆదిలాబాద్ జిల్లా దేశంలోనే నాలుగో స్థానంలో, రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ఎంపిక చేసిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి కమిషన్‌కు నివేదిక అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు మహేందర్, ధమ్మనంగ్, విఠల్, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.



కేస్లాపూర్‌లో పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధి జతిన్

క్లుప్తంగా

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



కోచ్ రాజేశ్‌తో క్రితి అగర్వాల్, ఉబైద్‌ఖాన్

మంచిర్యాలటౌన్: గోవాలో జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకా రులు ప్రతిభ చాటారు. క్రితి అగర్వాల్, ఉబైద్‌ఖాన్‌లు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ రాజేశ్ తెలిపారు. మొదటి గోవా జూ నియర్ మెన్, వుమెన్ నేషనల్ లెవల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొనగా, మంచిర్యాల నుంచి ఇద్దరు క్రితి అగర్వాల్, ఉబైద్ ఖాన్‌లు పాల్గొని సిల్వ ర్ మెడల్స్‌ను సాధించి, రన్నరప్‌లుగా నిలిచారు. 50–52 కేజీల బరువు విభాగంలో జూనియర్ గరల్స్‌లో క్రితిఅగర్వాల్, 48–50 కిలోల బరువు విభాగంలో జూనియర్ బాయ్స్ కేటగిరిలో ఉబైద్‌ఖాన్‌లు మెడల్స్‌ను సాధించారు. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్‌వీర్, క్రీడాసంఘాల సభ్యులు వారిని అభినందించారు.

జువాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా లైఫ్ మెంబర్‌గా రాకేశ్



రాకేశ్

జన్నారం: వివిధ రకాల పరిశోధనల ద్వారా అనేక అంశాలు గుర్తించడంలో చేసిన కృషికి మండలవాసికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. జన్నా రం మండలం మొర్రి గూడ గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన ప్రముఖ పరిశోధకుడు డాక్టర్ రాకేశ్ దావెల్ల లక్నోలోని జువాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా లైఫ్ మెంబర్‌గా ఎంపికయ్యారు. జంతుశాస్త్ర పరిశోధనల్లో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. ప్రస్తుతం ఆయన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీలోని పెస్టిసైడ్ రెసిడ్యూస్ లేబొరేటరీలో రీసెర్చ్ అసోసియేట్‌గా సేవలు అందిస్తున్నారు. ఈ గుర్తింపు రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, మరిన్ని పరిశోధనలు చేసి ప్రజలకు సేవలందించాలనే తన లక్ష్యమని తెలిపారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: భార్యపై దాడి చేసిన భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ప్రొహిబిషన్ ఎస్సై ప్రణయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్ కాలనీకి చెందిన జంగుబాయి–రాజు గత ఏడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల పాప ఉంది. భార్య అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి వద్ద డబ్బులు భద్రపర్చింది. ఆయన వద్ద ఎందుకు డబ్బులు ఉంచావని, అతనికి నీకు ఏం సంబంధమని అనుమానంతో గతనెల 31న భార్యపై రాడ్‌తో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన ఆమె ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతోంది. శనివారం డిశ్చార్జ్ అయి కేఆర్కే కాలనీలో ఆమె సోదరి ఇంటికి వెళ్లింది. విషయం తెలుసుకున్న భర్త రాజు అక్కడికి వెళ్లి హత్యాయత్నం చేయగా కేకలు వేయడంతో అతడు పరారయ్యాడు. ఆదివారం జంగుబాయి సోదరి కుమ్ర మౌనిక ఫిర్యాదుతో కేసు నమోదు చేసి రాజును అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ ఎస్సై తెలిపారు.

గిరి గ్రామాల్లో విత్తనపూజ

- ప్రారంభమైన 'మొహతుక్'
- చంచి భీమల్ దేవునికి పూజలు
- అనాదిగా వస్తున్న ఆచారం



సాకడలో అరకకు పూజ చేస్తున్న రైతు కుటుంబం



భేటింగ్ అవుతున్న ఆదివాసీలు

కెరమెరి(ఆసిఫాబాద్): ఏడాదిలో ఆరు మాసాలు ఏవో పండుగలు చేస్తూ.. తమకు తామే సాటిగా నిలుస్తున్నారు ఆదివాసీలు. తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో వారు ముందుంటున్నారు. మృగశిరకార్తె ప్రవేశించడంతో ఉమ్మడి జిల్లాలోని గిరి గ్రామాల్లో విత్తనపూజకు శ్రీకారం చుట్టారు. విత్తన (మొహతుక్) పూజలు పొలాల్లో రెండురోజులుగా కొనసాగుతున్నాయి. ప్రతీఏటా జరుపుకునే విత్తన పూజలతోనే తమతమ పొలాల్లో విత్తనాలు నాటడం ప్రారంభిస్తారు.

దేవతలకు విత్తనాలను చూపించారు

ఈ మాసంలో అన్ని గ్రామాల్లో గ్రామ పటేల్ ఇంట్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివాసీల కులదైవమైన పాటేరు అమ్మోరు, జంగుబాయి, గాంధారి కిల్ల, పద్మాల్‌పురి కాకో వద్దకు వెళ్లి విత్తనాలను చూపించారు. అక్కడే దేవతల ఆశీర్వాదం తీసుకుని తిరుగుపయనమయ్యారు. అనంతరం గ్రామంలో ఉన్న ఆకీపేన్, అమ్మోరు, పోచమ్మ వద్దకు విత్తనాలతో పూజలు చేశారు. అక్కడే పటేల్ ఇచ్చే విత్తనాలను తమతమ ఇళ్లకు తీసుకెళ్లారు. మళ్లీ అదే రోజు అర్ధరాత్రి 2.5 కిలోల జొన్నలను ఇంట్లోనే పడతారు. పట్టిన జొన్నలతో గట్కా తయారు చేసి ఆరగిస్తారు. జొన్న గట్క ఆరగించాక అర్ధరాత్రి అడవికి వెళ్లి (కుమ్మడ్) చెట్టు ఆకులను తీసుకువచ్చారు. ఆ ఆకులతో డొప్పలు తయారు చేసి అన్ని ఇళ్లల్లో ఇస్తారు. అందులో పూజ చేసిన విత్తనాలు వేస్తారు. ఈ పూజలు మరో రెండు రోజులు కొనసాగుతాయి.

విత్తన పూజలు(మొహతుక్)!

మృగశిర కార్తె ప్రవేశం నుంచి విత్తన పూజలు(మొహతుక్) పొలాల్లో సంప్రదాయ బద్ధంగా చేస్తారు. విత్తన పూజ చేసే రోజు రైతు కుటుంబమంతా ఉదయం పొలంబాట పడతారు. జొన్నతో గట్కా తయారీ చేసి కులదైవతలతోపాటు, నేలతల్లికి సమర్పిస్తారు. అనంతరం పొలంలో విత్తనాలు చల్లి అరకకు ప్రత్యేక పూజలు చేసి విత్తనాలు నాటుతారు. గ్రామపటేల్ ఇంటి ఎదుట మహిళలు అందరూ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలు చేస్తారు. పురుషులు గిల్లిదండా ఆట ఆడుతారు. అనంతరం సహపంక్తి భోజనం చేస్తారు. తర్వాత భేటింగ్ అయ్యారు.

చంచి భీమల్ దేవుడి కల్యాణంతో..

ఆదివాసీల ఇష్టదైవమైన చంచి భీమల్ దేవుడి కల్యాణం సందర్భంగా ఏటా మే నెలలో విత్తనాలను భీమల్ దేవుడికి చూపిస్తారు. ఆ రోజు ఆదివాసీలు భీమల్ దేవుడికి సంప్రదాయ పూజలు చేస్తారు. అడవుల్లో లభించే ఆకులతో ఆరు డొప్పలను తయారు చేస్తారు. అందులో పొలాల్లో పండించే అన్ని విత్తనాలను కలిపి దేవునికి చూపిస్తారు. అనంతరం వాటిని ఇళ్లకు తీసుకెళ్లి దాచి పెడుతారు. ఆ రోజు పిండి వంటలు చేసి ఆరగిస్తారు. మృగశిర కార్తె ప్రారంభంతో దాచి పెట్టిన విత్తనాలను తమ పంట పొలాల్లో చల్లుతారని చెబుతున్నారు.

ఇంద్రాదేవికి విత్తన పూజలు



ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో విత్తన పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీలు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి తయారీ చేసిన నవధాన్యాలతో నైవేద్యం సమర్పించారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు కురువాలని, పంటలు బాగా పండాలని అమ్మవారికి మొక్కుకున్నారు.

గ్రామాల్లో విత్తన పూజలు



మృగశిర కార్తె ప్రవేశించడంతో ప్రతీ గ్రామాల్లో విత్తన పూజలు(మొహతుక్) కొనసాగుతున్నాయి. ఆదివాసీ కుల దేవతలకు విత్తనాలు చూపించాకే తమతమ పొలాల్లో విత్తనాలు నాటుతున్నాం. అనాదిగా వస్తున్న ఆచారం.

– దుర్వతబాయి, మాజీ జెడ్పీటీసీ, కెరమెరి

దేవతలకు చూపించాకే!



పొలాల్లో విత్తనాలు నాటేకంటే కొద్ది రోజుల ముందు కులదైవాలకు విత్తనాలను చూపిస్తాం. అక్కడ ప్రత్యేక పూజలు చేశాకే పొలానికి వెళ్లి జొన్నగట్కాను ఆరగిస్తారు. అనంతరం నేల తల్లికి ప్రత్యేక పూజలు చేసి విత్తనాలు నాటడం ప్రారంభిస్తాం.

– ధర్మారావు, దేవారి సాకడ(సీ)

జంగల్ సఫారీలోకి 15 జింకలు



తీసుకువచ్చిన జింకలతో అటవీ అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): లక్సెట్టిపేట అటవీ రేంజ్ పరిధిలోని పాతమంచిర్యాల అటవీ సెక్షన్ పరిధిలో గల తిమ్మాపూర్ అటవీ బీట్‌లోని జంగల్ సఫారీలోకి ఆదివారం 15 జింకలను వదిలిపెట్టారు. హైదరాబాద్ హయత్‌నగర్ మహవీర్ హరిని వనస్థలి జాతీయపార్కు నుంచి తీసుకువచ్చిన జింకలను సఫారీలోని గడ్డి మైదానాల్లోకి వదిలిపెట్టారు. అవి గెంతులు వేస్తూ పరుగులు పెట్టాయి. లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అత్తె సుభాశ్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఎస్ఓ కొప్పుల రవి, ఎఫ్ఎస్ఓ అతావుల్లా, ఎఫ్‌బీఓలు రాజేందర్, స్వప్న పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన



పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆ సుపత్రిని ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొ జ్జు సందర్శించారు. ఆసుపత్రిలో ఆయన ఆరోగ్య స్థితిని పరీక్షించుకున్నారు. అనంతరం చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. పార్టీ నాయకులు అబ్దుల్ ఖయ్యుం, నాయకులు ఉన్నారు.

పొచ్చెరకు అడెల్లు మృతదేహం



బీజాపూర్‌లో అడెల్లు మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

- స్వగ్రామంలో కుటుంబీకుల రోదనలు
- నేడు అంత్యక్రియలు



మైలారపు అడెల్లు తాజా చిత్రం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బోథ్:మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ మృతదేహం ఆదివారం రాత్రి పొచ్చెర గ్రామానికి చేరుకుంది. చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. ప్రత్యేక అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకువచ్చారు. యువకుడిగా దళంలోకి వెళ్లిన అడెల్లు 30 ఏళ్ల తర్వాత శవమై ఇంటికి చేరడంతో వారి రోదనలు మిన్నంటాయి. రెండురోజులుగా ఎదురుచూసినవారంతా మృతదేహం కనిపించడంతో కన్నీటిపర్యంతమయ్యారు. గ్రామస్తులు ఎరుపు వస్త్రంను పార్థివదేహంపై కప్పి భాస్కర్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. అభిమానులు, పౌర హక్కుల సంఘం నేతలు భారీగా వచ్చే తరలివచ్చే అవకాశం ఉంది. కాగా, అక్కడి ఆదివాసీలు మృతదేహాన్ని తమకు అప్పగించాలని కోరారు. తామే దహన సంస్కారాలు నిర్వహిస్తామని పేర్కొనగా అక్కడి పోలీసులు దాదాపు 200 ఎస్కార్ట్‌తో అంబులెన్స్‌లో అడెల్లు మృతదేహాన్ని తెలంగాణ బార్డర్ వరకు పంపించారు.

ఆదివాసీ బిడ్డ చదువుకు అడ్డంకులు

- పాల్వంచలోని కళాశాలలో బీటెక్ (ఈఈఈ)లో సీటు
- జంగుబాయికు ఆర్థిక ఇబ్బందులు
- అనారోగ్యంతో పరీక్షకు హాజరుకాని వైనం
- ఎస్‌వీఆర్ ఫౌండేషన్, సాక్షి చొరవతో అన్ని భరిస్తామన్న కళాశాల యాజమాన్యం



విద్యార్థిని జంగుబాయి, గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌వీఆర్ ఫౌండేషన్ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: పట్టుదలతో చదువులో రాణిస్తున్న ఆదివాసీ బిడ్డకు ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారాయి. ఆదిలాబాద్ జిల్లాలోని మొలాల్‌గుట్ట–1 గ్రామంలో ఆదివాసీ కొలాం తెగకు చెందిన మడావి సంగీత–రాము దంపతుల కుమార్తె జంగుబాయి. ఈమె ఎంసెట్ -2021లో పరీక్ష రాసి మంచి ర్యాంకుతో భద్రాచలంలోని పాల్వంచలో అనుబోస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సీటు వచ్చింది. బీటెక్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ (ఈఈఈ) థర్డ్ ఇయర్‌లో అనారోగ్యం బారిన పడింది. దీంతో పరీక్షకు హాజరుకాలేకపోయింది. ప్రస్తుతం ఫీజు చెల్లించేందుకు డబ్బులు లేకపోవడంతో ఇంటి వద్దనే ఉంటోంది. ఆమె తన చదువు ముందుకు సాగేందుకు ఆర్థిక చేయూతనందించాలని వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేసింది. ఈ విషయాన్ని ఎస్‌వీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్ 'సాక్షి'దృష్టికి తీసుకువచ్చాడు. ఆదివారం ఫౌండేషన్ సభ్యులతోపాటు సాక్షి..మొలాల్‌గుట్ట–1 గ్రామానికి చేరుకుని ఆమెతో మాట్లాడి వివరాలు తెలుసుకుంది.

కళాశాల యాజమాన్యంతో ఫోన్‌లో సంప్రదింపు

మడావి జంగుబాయి..విషయమై పాల్వంచలోని అనుబోస్ కళాశాల యాజమాన్యంతో ఎస్‌వీఆర్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి 'సాక్షి'ఫోన్‌లో మాట్లాడింది. సదరు విద్యార్థిని ఫీజుల డబ్బులు మొత్తం కళాశాల యాజమాన్యం ఖర్చులు, అన్ని భరిస్తామని వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న తెలిపారు. ఎస్‌వీఆర్ ఫౌండేషన్, సాక్షి చొరవతో అన్ని భరిస్తామని పేర్కొన్నారు. దీంతో కళాశాల యాజమాన్యానికి ఎస్‌వీఆర్ ఫౌండేషన్ ధన్యవాదాలు తెలిపింది.

చిన్నప్పుడే తల్లి మృతి..

జంగుబాయికు ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. ఒకరు 9వ తరగతి చదివి మానేశాడు. మరొకరు ఇటీవల పదో తరగతి పూర్తిచేశాడు. కాగా, జంగుబాయి 9వ తరగతి చదువుతున్నప్పుడే తల్లి సంగీత మృతిచెందింది. తండ్రి రాము ఇంద్రవెల్లి మండలంలోని ధనోరా గ్రామంలో మేకల కాపరి పనిచేస్తున్నాడు.

ఐఏఎస్ నా లక్ష్యం



తల్లి మృతిచెందడం, తండ్రి వేరే గ్రామంలో పనిచేస్తున్నాడు. నా ఇద్దరు సోదరులతో కలిసి పిన్ని, బాబాయి వద్దే ఉంటున్నాను. పాల్వంచకు వెళ్లి చదవడానికి, అక్కడి వెళ్లేందుకు బస్సు చార్జీలు లేవు. ప్రభుత్వం, ఐటీడీఏ సహకరిస్తే అక్కడికి వెళ్లి ఫైనల్ ఈయర్‌లో ఉత్తీర్ణత సాధిస్తాను. ఐఏఎస్ కావడమే తన లక్ష్యం.

– జంగుబాయి

ఇద్దరి మధ్య గొడవ..ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ధన్‌గర్‌గల్లీకి చెందిన ముఖీమ్ (20), అదే కాలనీకి చెందిన షరీఫొద్దీన్‌లకు మధ్య శనివారం రాత్రి గొడవ చోటుచేసుకుంది. షరీఫొద్దీన్ ముఖీమ్‌ను నెట్టివేయడంతో కిందపడ్డాడు. శ్వాస ఆడక మృతిచెందాడు. స్థానికులు గమనించి వైద్యం కోసం రిమ్స్‌కు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తుచేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

బావిలో పడి బాలుడి..



అంజన్న (ఫైల్)

కౌటాల: మేకలు మేపడానికి వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని గురుడుపేటకు చెందిన నాగోసే రవీందర్, భాగ్య దంపతుల కుమారుడు అంజన్న(16) పది తరగతి పరీక్షల్లో ఫెయిలయ్యాడు. సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధపడుతున్నాడు. ఆదివారం ఉదయం తమ మేకలను మేపడానికి మరో ముగ్గురు యువకులతో కలిసి గ్రామ శివారులో వెళ్లారు. పొక్లెయిన్‌తో తవ్విన వ్యవసాయ బావిలో నీరు తాగేందుకు వెళ్లిన అంజన్న ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. ఈత రాక నీటిలో మునిగిపోయాడు. సదరు యువకులు గ్రామస్తులకు ఫోన్ చేసి చెప్పారు. వారు అక్కడికి చేరుకుని అంజన్నకు బయటకు తీసి సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సిర్పూర్(టి) ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. చేతికందిన కుమారుడు మృతితో కుటుంబీకులు బోరున విలపించారు. మృతుడికి చెల్లి అనురాధ, తమ్ముడు అనుదీప్ ఉన్నారు.

చికిత్సపొందుతూ విద్యార్థి..

మాక్లూర్(ఆర్మూర్): ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన నిర్మల్ జిల్లాకు చెందిన పాలిటెక్నిక్ విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం ..నిర్మల్ జిల్లా నరసాపురం గ్రామానికి చెందిన సిందే శివకుమార్(17) నిజామాబాద్ నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో అతడిని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన శివకుమార్.. ఈనెల 6న సెమిస్టర్ పరీక్షలు రాయడానికి నిజామాబాద్‌కు వచ్చాడు. మాక్లూర్ మండలం దాస్‌నగర్ శివారులో గడ్డి మందు తాగి హాస్టల్‌కు వెళ్లాడు. అక్కడ వాంతులు చేసుకోవడంతో స్నేహితులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఏకతాటిపైకి వచ్చి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పర్ధాన్ జన్‌జాతి ఉత్తన్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్వ నగేశ్ పిలుపునిచ్చారు. బజార్‌హత్నూర్ మండలం ఏసాపూర్‌లో ఈనెల 28న నిర్వహించనున్న గోండి ధర్మ గురువు హీరా సుకా విగ్రహ ప్రతిష్ఠాపన, భారీ బహిరంగసభ విజయవంతం కార్యాచరణపై జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ సహాయ మంత్రి దుర్గదాస్ ఉయికే, మహారాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అశోక్, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. అందరి సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. యాదవ్ రావ్, రాంకిషన్, నారాయణ, వనిత, గీత, పాండురంగ్, విఠల్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థికసాయం



కుటుంబీకులకు నగదు ఇస్తున్న బాపురెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్‌రూరల్: మండలంలోని రాయిపేట గ్రామానికి చెందిన దుర్గం రంజిత్ ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుకునేందుకు ఆర్థిక ంగా కష్టాలు పడుతున్నాడు. సాక్షి మెయిన్ పేజీలో ఈనెల 6న 'డాక్టర్ కలకు ఆర్థిక కష్టాలు'శీర్షికన ప్రచురితమైన కథనానికి మాజీ వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి స్పందించారు. రంజిత్ వైద్యవిద్యకోసం తల్లిదండ్రులు కిష్టయ్య, చిన్నక్కలకు ఆదివారం రూ.25 వేల ఆర్థికసాయం చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు రత్నసమ్మిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బోథ్: సొనాల మండలంలోని గుట్టపక్కతండా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో సరుకులు కాలం చెల్లిపోగా, గుడ్లు, ఇతర పదార్థాలు కుళ్లిపోయాయి. 'అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు, సరుకులు'శీర్షికన సాక్షిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి జిల్లా మహిళా శిశు, సంక్షేమ అధికారి మిల్కా, సీడీపీవో వినూత్న స్పందించారు. ఆదివారం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. 15 రోజులకు సరిపడా సరుకులను లబ్ధిదారులకు అందించారు. కేంద్రం ఇన్‌చార్జిని మార్చినట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్‌తోపాటు ఆయాపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బావ పెళ్లి చేసుకోవడం లేదని ఆత్మహత్య

నిర్మల్‌టౌన్: బావ పెళ్లి చేసుకోవడం లేదని అనుమానంతో మరదలు ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గత ఆరేళ్ల క్రితం ఒంగోలు నుంచి గురునాథం శ్రీను కుటుంబంతో కలిసి నిర్మల్ రూరల్ మండలం డ్యాంగాపూర్ గ్రామానికి వలసవచ్చి మేస్త్రీ పని చేసుకుంటున్నారు. శ్రీను చెల్లెలు రాధ ఒంగోలులో నివాసం ఉంటోంది. రాధ భర్త తాగుడుకి బానిస కావడంతో.. ఆమె రెండో కుమార్తె భవాని(17)ని మూడేళ్ల క్రితం తీసుకువచ్చి వీళ్ల దగ్గరనే ఉంచుకున్నారు. ఇంకో నాలుగేళ్ల తర్వాత శ్రీను తన కొడుకును, భవానిని ఇచ్చి పెళ్లి చేద్దామనుకున్నాడు. అయితే శ్రీను కొడుకు వేరే యువతితో ఫోన్‌లో మాట్లాడుతున్నాడని, తనను పెళ్లి చేసుకోడేమోనని భవాని అనుమానించింది. శనివారం రాత్రి 10 గంటలకు పూలమొక్కలకు కొట్టే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గడ్డిమందు తాగి యువకుడు..



మణికంఠరెడ్డి (ఫైల్)

భీమారం: కుటుంబ ఆర్థిక ఇబ్బందులను చూసి తట్టుకోలేక యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్వేత కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన గంట్ల మణికంఠరెడ్డి (26) హైదరాబాద్‌లోని ప్రైవేట్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆ ఉద్యోగాన్ని వదిలి గత కొంతకాలంగా భీమారంలో ఉంటున్నాడు. గత కొంత కాలంగా కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు మణికంఠని కలిచివేశాయి. దీంతో మనస్తాపం చెందిన మణికంఠ శనివారం ఉదయం ఇంట్లో వ్యవసాయ అవసరాల కోసం నిల్వ ఉంచిన గడ్డిమందు తాగాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలుపగా వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ అర్ధరాత్రి మరణించాడు. ఆదివారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూరు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పండుగలా ఆత్మీయ సమ్మేళనం



హాజరైన గురువులు, పూర్వ విద్యార్థులు

- తరలివచ్చిన పూర్వ గురువులు, విద్యార్థులు



ఎంపీ నగేశ్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు ఒక చోట చేరి, తమ గత స్మృతులను పంచుకోవడానికి, ఒకరినొకరు కలుసుకోవడానికి నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం పండుగలా నిర్వహించారు. ఉట్నూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 1950 నుంచి 2025 బ్యాచ్‌ల వరకు పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు, గురువులు తరలివచ్చారు. ఆదివారం ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని జేసీఎస్ ఫంక్షన్ హాల్ వేదికైంది. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. 75 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు, గురువులు ఒకే వేదికపై కలుసుకోవడం రాష్ట్రస్థాయిలో తొలి సమ్మేళనంగా చెబుతున్నారు. అంతకుముందు గురువులను బ్యాండుమేళాలతో స్వాగతం పలికారు. వారిని శాలువతో సత్కరించి సమస్కరించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడారు. ఉపాధ్యాయులు సూచించిన మార్గంలో ప్రస్తుతం వివిధ రంగాల్లో, హోదాల్లో ఉన్నామన్నారు. ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ అదే పాఠశాలలో ఛాత్రోపాధ్యాయుడిగా పనిచేశానని గుర్తుచేశారు. ఆత్మీయ సమ్మేళననిర్వహించిన కమిటీ సభ్యులను అభినందించారు.